సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
సోమవారం, 8, మే, 2023



ప్రశాంతంగా నీట్

వైద్య కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన నీట్ ఆదివారం అనంతపురంలో ప్రశాంతంగా జరిగింది.

8లో



యువకుడి అవార్డుల 'సేద్యం'

ధర్మవరానికి చెందిన చంద్రకాంత్ షార్ట్‌ఫిల్మ్స్ దర్శకుడిగా రాణించాడు. సేద్యంతో సినీ ఎంట్రీ ఇస్తున్నాడు.

8లో

గరిష్టం/కనిష్టం
36.1°/25.5°

జిల్లాలో ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఉక్కపోత అధికంగా ఉంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా వర్షపాతం నమోదైంది. వాయువ్య దిశగా గాలులు గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

నేడు 'స్పందన'

పుట్టపర్తి అర్బన్: కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం సోమవారం ఉంటుందని కలెక్టర్ అరుణ్‌బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల సచివాలయ స్థాయిలో ఫిర్యాదులు స్వీకరిస్తారన్నారు. అన్ని శాఖల అధికారులు ఉదయం 9.30 గంటల నుంచి అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

ఎస్పీ కార్యాలయంలో...

కొత్తచెరువు: ఎస్పీ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. బాధితులు అర్జీల రూపంలో సమస్యలు తెలియజేయవచ్చన్నారు.

31 మండలాల్లో వర్షం



పుట్టపర్తి అర్బన్: జిల్లాపై వరుణుడి ప్రభావం కొనసాగుతోంది. ఆదివారం జిల్లాలోని 31 మండలాల్లో వర్షపాతం నమోదైందని వాతావరణ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. అత్యధికంగా తాడిమర్రి మండలంలో 74.2 ఎంఎం వర్షపాతం నమోదైంది. అమడగూరు 27.8, అగళి 26.8, కనగానపల్లి 26.2, అమరాపురం 19.8, గుడిబండ 18, లేపాక్షి 16.4, బత్తలపల్లి 15.2, గోరంట్ల 13.2, రొద్దం 11.4, పరిగి 11.4, చిలమత్తూరు 10.2 మి.మీ చొప్పున వాన పడింది.

నయనానందకరం.. పుష్పయాగం



లక్ష్మీచెన్నకేశవస్వామికి 28 రకాల పూలతో పూజలు చేస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: ధర్మవరంలో కొలువైన శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామికి పుష్పయాగోత్సవం ఆదివారం నయనాందకరంగా సాగింది. ఉదయం 9గంటలకు ఉభయదాతలు పొరాళ్ల పుల్లయ్య కుటుంబ సభ్యులు పురవీధుల్లో 28 రకాల పుష్పాలను ఊరేగిస్తూ ఆలయానికి తీసుకొచ్చి స్వామికి సమర్పించారు. అన్నమయ్య సంకీర్తనలను అన్నమయ్య సేవా మండలి సభ్యులు ఆలపించారు. సాయంత్రం 6 గంటలకు శయనోత్సవం (ఏకాంత సేవ) కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ అధ్యక్షుడు దాసెట్టి సుబ్రహ్మణ్యం, అర్చకులు కోనేరాచార్యులు, మకరం దబాబు, భానుప్రకాష్ తదితరులున్నారు.

ఆసియా బీచ్ వాలీబాల్ జట్టుకు ఎంపిక



నరేష్

అనంతపురం: ఆసియా బీచ్ వాలీబాల్ చాంపియన్‌షిప్ టోర్నీ జూన్ 23 నుంచి 26వరకు జరగనుంది. ఇందులో భారత జట్టు తరఫున నార్పల మండలానికి చెందిన నరేష్ ఎంపికయ్యాడు. నరేష్ హైదరాబాద్‌లో కస్టమ్స్ విభాగంలో అధికారిగా పనిచేస్తున్నాడు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం



బీకేఎస్‌లో బీర పంటను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీధర్

బుక్కరాయసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన పంటల సాగును ప్రోత్సహిస్తోందని ప్రత్యేక అధికారి, ఉద్యానశాఖ కమిషనర్ శ్రీధర్ పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో దెబ్బతిన్న పంటలను రెండో రోజు ఆదివారం ఆయన పరిశీలించారు. బుక్కరాయసముద్రం, ధర్మవరం రూరల్ మండలాల్లో అరటి, ద్రాక్ష, సపోట, బొప్పాయి, టమాట, కాకర పంటలను పరిశీలించి, నిబంధనల మేరకు ప్రభుత్వం నుంచి ఇన్‌పుట్ సబ్సిడీ రూపంలో పరిహారం అందజేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఆదాయం వచ్చే పంటలు సాగు చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. తెగుళ్లు, వాటి నివారణ చర్యలపై సూచనలివ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా స్పెషల్ ఇన్‌చార్జ్, కమిషనరేట్ గుంటూరు డీడీ హెచ్ ధర్మజ, ఉద్యానశాఖ ఇన్‌చార్జ్ డీడీ నరసింహారావు, ఏపీఎంఐపీ పీడీ జి.ఫిరోజ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

ఫలితాలు పదిలం

- ఫలించిన సర్కారు చర్యలు
- గతేడాది కంటే 'పది'లో పెరిగిన ఉత్తీర్ణత శాతం
- అత్యధిక మార్కులతో ప్రభుత్వ విద్యార్థుల జయకేతనం
- 590 మార్కులతో కొడిగెనహళ్లి విద్యార్థి ఇలాహీ, రొళ్ల విద్యార్థిని ఐశ్వర్య సత్తా



తల్లిదండ్రులతో సంతోషం పంచుకుంటున్న కదిరి జెడ్పీ పాఠశాల విద్యార్థిని అతీఫా (586 మార్కులు)



584 మార్కులు సాధించిన కురుబ హేమలతకు స్వీట్ తినిపిస్తున్న తల్లి నాగమణి

ప్రశాంతి నిలయం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యారంగంలో తీసుకొస్తున్న సంస్కరణల ఫలితాలు పదోతరగతి ఫలితాల్లో స్పష్టంగా కనిపించాయి. కరోనా పరిస్థితులు తొలగిపోవడంతో ఈ ఏడాది పూర్తిస్థాయిలో విద్యాసంవత్సరం కొనసాగింది. ప్రారంభం నుంచే పాఠశాల విద్యాశాఖ పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించడంపై ప్రత్యేక దృష్టి సారించింది. దీంతో గతేడాది ఉమ్మడి అనంతపురం జిల్లాలో 49.70 శాతం ఉత్తీర్ణత సాధించగా, ఈ ఏడాది నూతనంగా ఏర్పడ్డ సత్యసాయి జిల్లాలో ప్రప్రథమంగా జరిగిన 'పది' పరీక్షలలో మెరుగైన ప్రతిభ కనబరుస్తూ 61.81 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. పరిగి మండలంలోని ఏపీఆర్ఎస్ గురుకుల పాఠశాలకు చెందిన ఇలాహీ, రొళ్ల జెడ్పీ పాఠశాల విద్యార్థిని ఐశ్వర్య 600 మార్కులకు 590 మార్కులు సాధించి పలువురితో శభాష్ అనిపించుకున్నారు.

ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ మొదటి స్థానం..

జిల్లాలోని ప్రయివేట్ యాజమాన్య పాఠశాలలు 85.44 శాతం ఉత్తీర్ణత సాధిస్తే, వాటి కంటే ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలు అత్యుత్తమ ప్రతిభ కనబ రుస్తూ 98.86 శాతం ఉత్తీర్ణత సాధించాయి. లేపాక్షి ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు 98.86 శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాలో టాప్‌లో నిలిచారు. జిల్లావ్యాప్తంగా 22,243 మంది పరీక్షలు రాయగా 10,156 మంది ప్రథమ శ్రేణిలో, 2,575 మంది ద్వితీయ శ్రేణి, 1,018 మంది తృతీయ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. హిందూపురం సేవా మందిర్‌కు చెందిన ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. టేకులోడు మహాత్మాపూలే బాలికల ఉన్నత పాఠశాలలో 76 మంది పరీక్షలు రాయగా 75 మంది పాసై 98.64 శాతం సాధించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 10,835 మంది పరీక్షలు రాయగా 3,216 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు.

అర్థమయ్యేలా బోధించడంతోనే..

మడకశిర రూరల్: రొళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఐశ్వర్య టెన్త్‌లో 590 మార్కులు సాధించడంపై ఉపాధ్యాయులతో పాటు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే, అమరాపురం మండలం హేమావతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అనిరుధ్ సాయి 581 మార్కులు సాధించారు. ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహించి, ప్రతి అంశం అర్థమయ్యేలా బోధించడంతోనే మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించామని వారు ఈ సందర్భంగా తెలిపారు. ప్రభుత్వంతో పాటు ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించడంతో మంచి మార్కులు వచ్చాయని తల్లిదండ్రులు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యారంగంలో తీసుకొచ్చిన సంస్కరణల పట్ల హర్షం వ్యక్తం చేశారు.



ఇలాహీ (590/600)



ఐశ్వర్య (590/600)

రైతు ఇంట విరబూసిన విద్యాకుసుమం

రొద్దం: మండలంలోని తురకలాపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కురుబ హేమలత పదోతరగతి పరీక్షా ఫలితాల్లో 600 మార్కులకు 584 మార్కులు సాధించి టాపర్లలో ఒకరిగా నిలిచింది. విద్యార్థిని తల్లిదండ్రులు నాగమణి, కేపీ శ్రీనివాసులు వ్యవసాయం చేసుకుంటూ కుమార్తెను గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివిస్తున్నారు. పాఠశాల సెలవులు ఉన్నప్పుడు వ్యవసాయ పనుల్లో సాయపడేదని తల్లిదండ్రులు తెలిపారు. సామాన్య రైతు ఇంట విద్యాకుసుమం విరబూసిందని పాఠశాల హెచ్ఎం శివరాం, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. పలువురు అభినందనలు తెలిపారు.

జిల్లాలో వివిధ యాజమాన్య పాఠశాలలు సాధించిన ఫలితాలిలా..

యాజమాన్యం	ఉత్తీర్ణత శాతం
ఏపీ మోడల్ స్కూల్స్	68.07
ఏపీ రెసిడెన్షియల్	98.86
ఏపీ సోషల్ వెల్ఫేర్	82.74
ఏపీ ట్రైబల్ వెల్ఫేర్	68.81
ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు	52.14
ప్రభుత్వ ఎస్టీ ఆశ్రమ	52.94
కేజీబీవీ	59.52
ఎమ్‌జేపీఏపీబీసీడబ్ల్యూఆర్	89.11
మున్సిపల్	55.29
మున్సిపల్ ఉర్దూ	44.57
ప్రయివేట్	85.44
జిల్లా పరిషత్	48.58

ప్రభుత్వ స్కూళ్లలో 580, ఆపైన మార్కులు సాధించిన విద్యార్థులు

ఇలాహీ	పరిగి ఏపీఆర్ఎస్ గురుకుల పాఠశాల	590
ఐశ్వర్య	రొళ్ల జెడ్పీహెచ్ఎస్	590
టీ నరసింహనాయుడు	పరిగి ఏపీఆర్ఎస్ గురుకుల పాఠశాల	588
లక్ష్మీ వసంత్	పరిగి ఏపీఆర్ఎస్ గురుకుల పాఠశాల	587
ఎం.అతీఫా	కదిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల	586
జి.గంగ్రోతి	టేకులోడు గురుకుల పాఠశాల	586
కురుబ హేమలత	తురకలాపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల	584
ఎల్‌కె. రాజేష్	లేపాక్షి మహాత్మా జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాల	583
తనూజ	లేపాక్షి కస్తూరి బా గాంధీ విద్యాలయం	583
రుచితా బాయి	కొత్తచెరువు బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల	582
విష్ణు సహర్ష	ముదిగుబ్బ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల	581
అశ్విని	సంతేబిదనూర్ జెడ్పీఉన్నతపాఠశాల	581
రవితేజ	మేడాపురం ఉన్నత పాఠశాల, సీకే పల్లి మండలం	581
షణ్ముఖ్	పరిగి ఏపీఆర్ఎస్ గురుకుల పాఠశాల	581
టీఎన్.త్రిష	ఎంజేపీఏపీ బీసీవెల్ఫేర్ స్కూల్, టేకులోడు	581
అనిరుధ్ సాయి	హేమావతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల	581
నందకిషోర్	మోదా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల	580

'స్పందన' ఉండాల్సిందే!

- కార్యక్రమ పర్యవేక్షణకు ఆడిట్ టీంలు
- సమస్యలకు కింది స్థాయిలోనే పరిష్కారం దక్కేలా ఏర్పాటు
- పల్లెవాసులకు తప్పనున్న వ్యయప్రయాసలు



జగరాజుపల్లి సచివాలయం

పుట్టపర్తి అర్బన్: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకొచ్చింది. గ్రామాలు, వార్డుల్లో సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. జిల్లా, డివిజన్, మండల స్థాయిలోనే కాకుండా సచివాలయాల్లోనూ 'స్పందన' కార్యక్రమం చేపట్టింది. రోజూ సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకూ సిబ్బంది అర్జీలు స్వీకరించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంది. అయితే, ఈ విషయం తెలియక చాలామంది జిల్లాకేంద్రంలో జరిగే 'స్పందన'కు వస్తున్నారు. భూములు, స్థలాల సర్వే, పట్టాలో ఒక పేరు.. ఆన్‌లైన్‌లో మరో పేరు, సంక్షేమ పథకాల వర్తింపు, రోడ్లు, డ్రయినేజీ, పింఛన్లు, రేషన్ కార్డుల మంజూరులాంటి గ్రామస్థాయిలోనే పరిష్కారం కావాల్సిన చిన్న సమస్యలు కూడా కలెక్టరేట్ వరకూ వస్తున్నాయి. ప్రతి సోమవారం పుట్టపర్తిలో కలెక్టర్, ఎస్పీ ఆధ్వర్యంలో జరిగే 'స్పందన'లో 50 శాతం వరకూ ఇలాంటివే ఉంటున్నాయి.

ఆడిట్ టీంలతో నిర్లక్ష్యానికి చెక్..

ప్రజల వ్యయప్రయాసలను గమనించిన కలెక్టర్ అరుణ్‌బాబు వాటిని దూరం చేయడమే లక్ష్యంగా చర్యలకు ఉపక్రమించారు. గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయిలో నిర్వహించే 'స్పందన'లో అధికారులు ఏమాత్రం పనితీరు కనబరుస్తున్నారనే విషయాన్ని పరిశీలించేందుకు ఆడిట్ టీంలు ఏర్పాటు చేశారు. అధికారులు ఎక్కడా నిర్లక్ష్యం ప్రదర్శించకుండా, ప్రజా సమస్యలు పరిష్కరించాలనే లక్ష్యంతో వీటిని ఏర్పాటు చేశారు. 'స్పందన'లో వచ్చే అర్జీల పరిష్కారంలో అలసత్వం చూపే అధికారులపై చర్యలు కూడా తీసుకోనున్నారు. దీంతో చాలా సమస్యలు జిల్లాకేంద్రం వరకూ రాకుండా పల్లెల్లోనే పరిష్కారమయ్యే అవకాశముంది.


ఆడిట్ టీంలు ఇలా..

జిల్లా స్థాయి:
డీఆర్ఓ కొండయ్య, ఏఎస్పీ రామకృష్ణప్రసాద్, డీపీఓ విజయ్‌కుమార్, డీఏఓ సుబ్బారావు, డీఎంహెచ్ఓ ఎస్వీ కృష్ణారెడ్డి, కమిషనర్ వెంకటరామిరెడ్డి.

డివిజన్ స్థాయి:
సబ్ కలెక్టర్, ఆర్డీఓ, డీఎస్పీ, డీఎల్‌డీఓ, డీఏఓ, డిప్యూటీ డీఎంహెచ్ఓ, మున్సిపల్ కమిషనర్.

మండల స్థాయి:
తహసీల్దార్, ఎస్సై, ఎంపీడీఓ, ఏఓ, మెడికల్ ఆఫీసర్, ఈఓఆర్డీ

నియోజక వర్గం	సచివాలయాలు
పుట్టపర్తి	77
ధర్మవరం	95
కదిరి	108
మడకశిర	61
హిందూపురం	101
పెనుకొండ	66
రాప్తాడు (మూడు మండలాలు)	36
మొత్తం	544



అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం

ప్రతి రోజూ సచివాలయాల్లో స్పందన కార్యక్రమాన్ని సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకూ నిర్వహించాలి. ప్రతి అధికారీ హాజరు కావాలి. జిల్లా అధికారులు డివిజన్, మండల స్థాయి స్పందనను పరిశీలించి సిబ్బంది పనితీరు, హాజరుపై నివేదిక ఇవ్వాలి. అర్జీదారులకు సంతృప్తి కలిగేలా పరిష్కారం చూపాల్సిందే. దీన్ని ఆడిట్ టీంలో పరిశీలిస్తూ తగిన సూచనలు, సలహాలు అందజేస్తాం.

– అరుణ్‌బాబు, కలెక్టర్

ఎంటెక్‌లో నూతన కోర్సు

- జేఎన్‌టీయూఏలో స్ట్రక్చరల్ ఇంజినీరింగ్ కోర్సు
- కోర్సు నిర్వహణకు రోడ్లు, రవాణా మంత్రిత్వ శాఖ ఆర్థికసాయం
- ప్రాజెక్ట్ నిర్వహణకు రూ.4 కోట్ల నిధులు విడుదల



అనంతపురం: నిర్మాణరంగం వేగవంతంగా అభివృద్ధి చెందుతోంది. రహదారుల నిర్మాణం విస్తారంగా జరుగుతోంది. ఈ నేపథ్యంలో టన్నెల్స్, బ్రిడ్జి నిర్మాణంలో నిపుణుల అవసరం ఏర్పడింది. అయితే టన్నెల్స్, బ్రిడ్జి నిర్మాణంలో ఇంజినీరింగ్ పూర్తి చేసిన వారి కొరత అధికంగా ఉంది. ఈ క్రమంలో భారత ప్రభుత్వ రోడ్లు, రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ఎంటెక్ కోర్సు నిర్వహించడానికి ఆర్థిక చేయూత ప్రకటించింది. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలోని సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో ఎంటెక్ స్ట్రక్చరల్ (బ్రిడ్జి, టన్నెల్స్) కోర్సు ప్రవేశపెట్టారు. 2023-24 విద్యా సంవత్సరం నుంచే ఈ కోర్సును అమలు చేస్తున్నారు. దేశంలో ఎంటెక్ స్ట్రక్చరల్ (బ్రిడ్జి, టన్నల్స్) కోర్సు అమలు చేస్తున్న తొలి వర్సిటీగా జేఎన్‌టీయూ అనంతపురానికి ఖ్యాతి దక్కింది. త్వరలో ఏపీ పీజీఈసెట్-2023 నిర్వహించనున్నారు. ఇందులో ప్రతిభ కనబరచి ర్యాంకులు దక్కించుకున్న వారికి సీట్లు కేటాయించనున్నారు.

ప్రత్యేకంగా ల్యాబ్

తొలి 5 సంవత్సరాలు ఎంటెక్ స్ట్రక్చరల్ ఇంజినీరింగ్ కోర్సు నిర్వహణకు భారత రోడ్లు రహదారుల మంత్రిత్వ శాఖ చేయూతనిచ్చింది. ఇందుకు రూ.4 కోట్ల నిధులు మంజూరు చేసింది. స్ట్రక్చరల్ ల్యాబ్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్నారు. ల్యాబ్ నిర్వహణకు ఏడాదికి రూ.25 లక్షలు ఖర్చు చేయనున్నారు. మొత్తం 25 సీట్లు కేటాయించారు. వేసవి సెలవుల్లో ఇంటర్న్‌షిప్‌కు అయ్యే మొత్తం, ఫ్యాకల్టీ జీతాలు, ప్రత్యేక ఎన్ఐటీ, ఐఐటీ ప్రొఫెసర్లకు భారత రహదారుల మంత్రిత్వశాఖ భరించనుంది. కోర్సు అనంతరం ఉద్యోగావకాశాలు కల్పిస్తారు.

తొలి వర్సిటీగా గుర్తింపు



దేశంలో ఎంటెక్ స్ట్రక్చరల్ కోర్సు నిర్వహిస్తున్న తొలి యూనివర్సిటీగా జేఎన్‌టీయూఏకు గుర్తింపు రావడం గర్వకారణం. ప్రస్తుత పరిస్థితుల్లో నిర్మాణ రంగం వేగవంతంగా అభివృద్ధి చెందుతోంది. ఈ కోర్సు మంజూరుకు సహకరించిన భారత రహదారుల మంత్రిత్వశాఖ, ఏపీ ప్రభుత్వానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నాం.

–ప్రొఫెసర్ జింకా రంగజనార్దన, వీసీ, జేఎన్‌టీయూ అనంతపురం

డిమాండ్ ఉన్న కోర్సు



ఎంటెక్ స్ట్రక్చరల్ ఇంజినీరింగ్ కోర్సులో 2023-24 విద్యా సంవత్సరం నుంచే అడ్మిషన్లు నిర్వహిస్తున్నాం. మొత్తం 25 సీట్లు కేటాయించారు. కోర్సు పూర్తి చేసిన వారికి మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి.

–ప్రొఫెసర్ సి.శశిధర్, కోర్సు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్

పన్ను వసూలులో ధర్మవరం టాప్

ధర్మవరం: ఆస్తి పన్ను వసూలులో ధర్మవరం మున్సిపాలిటీ అగ్రస్థానంలో నిలిచింది. అధికారుల సమష్టి కృషి, ప్రజల సహకారం, మొండి బకాయిలపై వడ్డీ మాఫీ చేస్తూ ప్రభుత్వం విడుదల చేసిన జీఓతో మున్సిపాలిటీవాసులు పన్ను చెల్లించేందుకు ఉత్సుకత కనబరిచారు. దీంతో లక్ష్యంలో 90.80 శాతం పూర్తి చేసి ఇటు జిల్లాలో మొదటి మున్సిపాలిటీగా, అటు ఉమ్మడి అనంతపురం జిల్లాలో రెండో మున్సిపాలిటిగా ధర్మవరం రికార్డు సృష్టించింది. మున్సిపాలిటీ పరిధిలో గృహ, వాణిజ్య సముదాయాలు 31,655 ఉన్నాయి. వీటికి సంబంధించి పన్ను వసూలు లక్ష్యం రూ.8.81 కోట్ల దాకా ఉంది.

ఊరటనిచ్చిన జీఓ..

కరోనా వంటి కష్ట కాలంలో ప్రజలు చాలా వరకు ఆస్తి పన్ను చెల్లించలేకపోయారు. మొండి బకాయిలపై వడ్డీ సైతం భారంగా మారింది. ఈ పరిస్థితిలో జనం కష్టాలను గుర్తించిన ప్రభుత్వం మొండి బకాయిలపై వడ్డీని పూర్తి మాఫీ చేసేలా జీఓ నంబర్ 34 విడుదల చేసింది. దీంతో ప్రజలు ఎంతో సంతోషంగా ఆస్తి పన్ను చెల్లించారు. వడ్డీ మాఫీతో మున్సిపాలిటి పరిధిలోనే రూ.4 కోట్ల దాకా ప్రభుత్వ, ప్రైవేట్ భవనాల యజమానులకు ఉపశమనం లభించింది. దీనికి తోడు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, మున్సిపల్ రెవెన్యూ సిబ్బంది నిరంతరం శ్రమించడం ఫలితంగా లక్ష్యంలో రూ.8.కోట్లు వసూలు చేసి 90.80 శాతం సాధించింది.



పరుగులు పెట్టనున్న అభివృద్ధి..

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్లలోనే ధర్మవరం మున్సిపాలిటీలో రూ.14 కోట్ల దాకా సీసీరోడ్లు, డ్రైనేజీలకు ఖర్చు చేశారు. ప్రస్తుతం పన్ను వసూలుతో పెరిగిన మున్సిపాలిటీ ఆదాయం ద్వారా మరింతగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే వీలు కలిగినట్లైంది.

సమష్టి కృషితోనే..

మున్సిపల్, సచివాలయ సిబ్బంది, వార్డు వలంటీర్లు, ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సహకారంతో ఈ ఏడాది రూ.8.81 కోట్ల లక్ష్యానికి రూ.8 కోట్లు వసూలు చేశాం. 90.80 శాతం వసూలుతో జిల్లాలో ధర్మవరం మున్సిపాలిటీని అగ్రస్థానంలో నిలవడం ఆనందంగా ఉంది.

– మల్లికార్జున, మున్సిపల్ కమిషనర్, ధర్మవరం

ప్రభుత్వానికి ధన్యవాదాలు



పట్టణంలో అత్యధిక సంఖ్యలో చేనేతలు ఉన్నారు. ప్రభుత్వం ఆస్తి పన్నుపై మొండి బకాయిలకు సంబంధించి వడ్డీ మాఫీ చేయడంతో వారికి ఎంతో సాంత్వన లభించినట్లయింది. ధర్మవరం చేనేతలందరి తరఫున ప్రభుత్వానికి ధన్యవాదాలు.

– జింకా కంబగిరి, ధర్మవరం

సత్వరం చెల్లించాం..



ఆస్తి పన్ను మొండి బకాయిలపై ప్రభుత్వం వడ్డీమాఫీ చేయడం పేద, మధ్య తరగతి ప్రజలకు ఊరటనిచ్చింది. రెండేళ్లుగా కరోనా కారణంగా ఉపాధి లేక ఆస్తి పన్ను చెల్లించలేదు. ప్రభుత్వం వడ్డీ మాఫీ చేయడంతో సత్వరం చెల్లించాం.

– శంకర్, చేనేత కార్మికుడు, కేశవనగర్, ధర్మవరం.

క్లుప్తంగా

మె.. తో కొడతా కొడకా!

- హౌసింగ్ ఏఈని ఫోన్‌లో బండబూతులు తిట్టిన టీడీపీ సర్పంచ్

నల్లమాడ: మండల హౌసింగ్ ఏఈ వరుణ్‌పై పులగంపల్లి గ్రామ సర్పంచ్ (టీడీపీ) ప్రభాకరరెడ్డి బండ బూతులతో విరుచుకుపడ్డాడు. అసభ్య పదజాలంతో తన అక్కసు వెళ్లగక్కాడు. ఘటనపై పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. వివరాలు... శనివారం సాయంత్రం 5 గంటల సమయంలో ఏఈ వరుణ్‌కు సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి ఫోన్ చేసి తన పంచాయతీ పరిధిలో తనకు తెలియకుండా హౌసింగ్ బిల్లులు ఎలా చేస్తావంటూ నిలదీశాడు. దీనిపై ఏఈ మాట్లాడుతూ.. ఇల్లు కట్టుకున్నవారికే బిల్లులు చేసినట్లు వివరించారు. ఇల్లు కట్టకపోయినా..... ఇల్లు కట్టుకున్నట్లు బిల్లు చేసి ఉంటే కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేస్తే పరిశీలిస్తామని సూచించారు. దీంతో రెచ్చిపోయిన సర్పంచ్... 'నేను మీ ఆఫీస్‌కు రావాలేరా బోసిడీకే.. నువ్వేమైనా సుపీరియర్ అనుకుంటున్నావా? తమషా చేస్తావా? మె.. తో కొడతా... కొడకా. ఎవడికి చెప్పుకుంటావో చెప్పుకో. కాల్ రికార్డు చేసుకుని కలెక్టర్‌కు పెట్టుకోరా. ఏమైతాది. నీ కథ చూస్తా. రెన్నాళ్లుండు' అంటూ విరుచుకుపడ్డాడు. ఘటనపై ఆదివారం ఉదయం పోలీసులకు బాధితుడు వరుణ్ ఫిర్యాదు చేశారు.

వ్యక్తి దుర్మరణం


మృతుడు గణేష్

మడకశిర రూరల్: లారీ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. గుడిబండ మండలం ఎస్ఎస్ గుండ్లు గ్రామానికి చెందిన గణేష్ (40), లలితమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆదివారం ఉదయం వ్యక్తిగత పనిపై ద్విచక్ర వాహనంపై మడకశిరకు బయలుదేరిన గణేష్‌ను యు.రంగాపురం వద్ద రోడ్డు మలుపులో వేగంగా దూసుకొచ్చిన సిమెంట్ మిక్సింగ్ లారీ ఢీకొంది. ఘటనలో గణేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

అనంత యువకుడి.. అవార్డుల సేద్యం



'అనంత' నేలకు పవరెక్కువ. అరుదైన ఖనిజాలు ఇస్తుంది. అపురూపమైన పంటలూ పండిస్తుంది. సాహితీ పరిమళాలను వెదజల్లుతుంది. మట్టిలో మాణిక్యాలనూ వెలికితీస్తుంది. ఈ నేలపై పుట్టిన వారెందరో వివిధ రంగాల్లో సత్తా చాటుతున్నారు. సినీరంగంలోనూ ప్రతిభ నిరూపించుకుంటున్నారు. అలాంటి వారిలో చంద్రకాంత్ పసుపులేటి ఒకరు. లఘుచిత్రాల (షార్ట్ ఫిలిమ్స్) ద్వారా సత్తా చాటిన ఈ యువకుడు ఇప్పుడు సినీ 'సేద్యం' చేయడానికి సిద్ధమయ్యాడు. - అనంతపురం డెస్క్ :


అనంత ఫిలిం ఫెస్టివల్‌లో అవార్డు అందుకుంటున్న చంద్రకాంత్ పసుపులేటి (వృత్తంలో)

- దర్శకుడిగా రాణిస్తున్న చంద్రకాంత్ పసుపులేటి
- పలు షార్ట్ ఫిలిమ్‌ల రూపకల్పన
- 'సేద్యం'తో సినీ ఎంట్రీ
- ఇప్పటికే పలు అవార్డులు కైవసం


'సేద్యం' చిత్రీకరణలో చంద్రకాంత్ పసుపులేటి, కెమెరామెన్ విష్ణువర్ధన్‌రెడ్డి


సేద్యం చిత్రంలోని ఓ సన్నివేశానికి దర్శకత్వం వహిస్తున్న చంద్రకాంత్ పసుపులేటి (ఫైల్)

సినీ నేపథ్యం లేకున్నా..

ధర్మవరానికి చెందిన చంద్రకాంత్ పసుపులేటి తండ్రి శ్రీనివాసులు జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా)లో కొత్తచెరువు మండల టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. తల్లి పద్మావతి ధర్మవరం ఆర్టీసీ డిపోలో కండక్టర్. ప్రస్తుతం వీరు అనంతపురంలో నివాసముంటున్నారు. ఎంబీఏ చదివిన చంద్రకాంత్‌కు సినీ రంగంలో దర్శకుడిగా రాణించాలన్నది కోరిక. ఎలాంటి సినీ నేపథ్యమూ లేకపోయినప్పటికీ పట్టుదలతో అడుగులు ముందుకు వేశారు. షార్ట్‌ఫిలిమ్‌ల ద్వారా ప్రస్థానాన్ని ప్రారంభించాడు. ఇప్పటివరకు 11 షార్ట్ ఫిలిమ్స్ రూపొందించాడు. సామాజిక అంశాలు ఇతివృత్తంగా రూపొందించిన ఈ షార్ట్ ఫిలిమ్స్ అన్నీ ప్రశంసలు అందుకున్నాయి. తెలంగాణ ప్రాంతం నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లి.. అక్కడ వారు పడుతున్న ఇబ్బందులపై రూపొందించిన 'గల్ఫ్ గోస' షార్ట్ ఫిలిమ్ చిత్రపురి, అనంత ఫిలిం ఫెస్టివల్స్‌లో అవార్డులు కైవసం చేసుకుంది. దుబాయ్‌లో జరిగిన అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్‌కు కూడా ఎంపికైంది. ఈ లఘు చిత్రానికి దర్శకత్వం వహించిన చంద్రకాంత్‌ను బీఆర్ఎస్ ఎంపీ కల్వకుంట్ల కవిత ట్విట్టర్ ద్వారా ప్రత్యేకంగా అభినందించారు. రావుగారి పిల్ల, జ్ఞాపకం షార్ట్‌ఫిలిమ్స్ కూడా ప్రశంసలు తెచ్చిపెట్టాయి.

సినీ 'సేద్యం' ప్రారంభం

షార్ట్ ఫిలిమ్స్ ద్వారా ప్రతిభావంతుడిగా గుర్తింపు తెచ్చుకున్న చంద్రకాంత్ 'సేద్యం' ద్వారా సినీ ఎంట్రీ ఇచ్చారు. రాయలసీమ రైతుల స్థితిగతులను ప్రత్యక్షంగా చూసిన చంద్రకాంత్ వాటిని ఇతివృత్తంగా తీసుకుని 'సేద్యం' కథ రూపొందించాడు. అది నచ్చడంతో ధర్మవరానికి చెందిన గోరకాటి మహేష్‌రెడ్డి, గాజుల పద్మావతి జీపీఆర్ ప్రొడక్షన్ బ్యానర్ కింద సినిమా నిర్మించడానికి ముందుకు వచ్చారు. ఉమ్మడి జిల్లాకే చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి ఛాయాగ్రాహకుడిగా తెరకెక్కిన ఈ సినిమా చిత్రీకరణ మొత్తం రాప్తాడు, బుక్కచెర్ల, పుట్టపర్తి, ధర్మవరం, సిద్దరాంపురం, ఆత్మకూరు, ఎస్ఎస్ గేటు , సోములదొడ్డి, గార్లదిన్నె ప్రాంతాల్లో పూర్తి చేశారు. నటీనటులుగా ఎక్కువ మందికి ఉమ్మడి అనంతపురం జిల్లావాసులకే అవకాశం కల్పించారు. నేపథ్య సంగీతం అరుణ్ కీస్, కొరియోగ్రఫీ వినోద్ జీ అందించారు. వీరూ 'అనంత' వాసులే.

విడుదలకు ముందే అవార్డుల పంట..

'సేద్యం' సినిమా విడుదలకు ముందే అవార్డుల పంట పండిస్తోంది. ఏ ఫిలిమ్ ఫెస్టివల్‌కు వెళ్లినా అవార్డుతో తిరిగొస్తోంది. ఇప్పటికే ఐఎఫ్ఎంఏ విశాఖ, సిత్తనవసల్, డెక్కన్ ఇంటర్నేషనల్, ఇండో-ఫ్రెంచ్, తామిజంగం ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో అవార్డులు కైవసం చేసుకుంది. రైతన్నల కష్టనష్టాలను చక్కగా చిత్రీకరించిన దర్శకుడు చంద్రకాంత్‌ను సినీ విమర్శకులు సైతం అభినందించారు.

సందేశాత్మక చిత్రాలు తీయడమే లక్ష్యం

సామాజిక అంశాలపై స్పందించి..సందేశాత్మక చిత్రాలు తీయడమే నా లక్ష్యం. నా షార్ట్ ఫిలిమ్‌లు కూడా ఇదే తరహాలో ఉంటాయి. త్వరలో విడుదల కానున్న 'సేద్యం' సినిమా రైతన్నల జీవన విధానాన్ని, ఇబ్బందులను ప్రతిబింబిస్తుంది. ఈ సినిమాకు విడుదలకు ముందే పలు అవార్డులు,ప్రశంసలు లభించడం ఆనందంగా ఉంది.

– చంద్రకాంత్ పసుపులేటి, సినీ దర్శకుడు

బసవనపల్లిలో విషాదం

- వేర్వేరు ఘటనల్లో ఇద్దరి మృతి
- మృతులిద్దరూ కర్ణాటక వాసులే
- భూతప్ప ఉత్సవాలు చూసేందుకు వచ్చి అకాల మృత్యువాత

అమరాపురం: మండలంలోని బసవనపల్లిలో విషాదం నెలకొంది. భూతప్ప ఉత్సవాలను చూసేందుకు వచ్చిన ఇద్దరు కర్ణాటక వాసులు వేర్వేరు ఘటనల్లో మృతి చెందారు. ప్రమాదవశాత్తు చెరువు నీటిలో పడి ఒకరు మృతిచెందగా... విషపురుగు కాటుతో మరో యువతి ప్రాణాలు కోల్పోయింది. పోలీసులు తెలిపిన మేరకు...

బెంగళూరుకు చెందిన కాంతరాజు (29) టెంపో ట్రావెల్స్ వాహనం ఏర్పాటు చేసుకుని డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. బెంగళూరులో ఉద్యోగాలు చేస్తున్న బసంపల్లి వాసులు పలువురు టెంపో ట్రావెల్స్‌ను అద్దెకు మాట్లాడుకుని శనివారం ఉదయం స్వగ్రామంలో జరుగుతున్న భూతప్ప ఉత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చారు. ఆదివారం ఉదయం తన స్నేహితుడితో కలసి సమీపంలోని చెరువు కట్ట వద్దకు చేరుకున్న కాంతరాజు... ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో పడ్డాడు. ఈత రాక నీట మునగడంతో స్నేహితుడి కేకలతో అప్రమత్తమైన స్థానికులు వెంటనే చెరువులో దూకి కాంతరాజును వెలికి తీసి, వెంటనే గుడిబండ పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

విషపురుగు కాటుతో...

కర్ణాటకలోని శిరా తాలూకా కాటనహళ్లికి చెందిన భూతప్ప కుమార్తె శ్రీదేవి (24) ఇటీవల తల్లిదండ్రులతో కలసి అమరాపురం మండలం బసవనపల్లిలోని అమ్మమ్మ ముద్దీరమ్మ ఇంటికి వచ్చింది. శనివారం రాత్రి భోజనం ముగించుకున్న అనంతరం అందరూ ఇంటి ఆవరణలో పడుకున్నారు. తెల్లవారుజామున ఎడమ చేతి వేలికి ఏదో కాటు వేసినట్లుగా అనిపించడంతో నిద్ర మేల్కొన్న శ్రీదేవి.. విషయాన్ని తన తల్లి భాగ్యమ్మకు తెలిపింది. వెంటనే కుటుంబసభ్యులు ఆమెను గుడిబండ పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచనమేరకు మడకశిరలోని ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి హిందూపురంలోని జిల్లాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తీసుకెళుతుండగా మార్గమధ్యంలో గౌరిబిదనూరుకు చేరుకోగానే పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో అక్కడి ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స అందేలోపు ఆమె మృతి చెందింది. ఘటనపై భూతప్ప ఫిర్యాదు మేరకు అమరాపురం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

తపాలా ఉద్యోగుల ఎన్నికలు ప్రశాంతం

- ఉదయం 7 గంటలకే మొదలైన పోలింగ్ ప్రక్రియ

అనంతపురం సిటీ: తపాలా ఉద్యోగుల పరస్పర సహకార సంఘం (కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ) ఎన్నికల ప్రక్రియ ముగిసింది. ఆదివారం నిర్వహించిన పోలింగ్ ఘట్టం సాధారణ ఎన్నికలను తలపించింది. అనంతపురంలోని ఆదిమూర్తి నగర్‌లో ఉన్న గిల్డ్ ఆఫ్ సర్వీస్ బాలికల పాఠశాలలో పోలింగ్ నిర్వహించారు. మొత్తం 11 డైరెక్టర్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించగా, రెగ్యులర్ ఉద్యోగులకు తొమ్మిది స్థానాలు, జీడీఎస్ ఉద్యోగులకు రెండు స్థానాలు కేటాయించారు. రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. భారీ పోలీస్ బందోబస్తు మధ్య ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ మొదలైంది. జిల్లాలోని అన్ని ప్రాంతాలకు చెందిన తపాలా ఉద్యోగులు భారీగా తరలివచ్చారు. ఎన్నికల అధికారి ఎస్.కుమార్ పర్యవేక్షణలో పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. సాయంత్రం నుంచి ఓట్ల లెక్కింపు మొదలైంది.

విజేతలు వీరే..

- రెగ్యులర్ ఉద్యోగుల విభాగం నుంచి తొమ్మిది స్థానాలకు 18 మంది పోటీ పడ్డారు. 488 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోగా, 46 ఓట్లు చెల్లకుండాపోయాయి. గెలుపొందిన వారిలో కె.గణేనాయక్, పీఎస్ఆర్‌కే ప్రసాద్, బి.హర్షవర్ధన్‌రెడ్డి, పెండ్యాల విశ్వనాథ్, ఎ.విశ్వనాథరెడ్డి, బి.నవీన్‌కుమార్, ఎస్‌కే మహేష్‌గౌడ్, బి.మంజునాథ్, బి.నరేంద్రనాథరెడ్డి ఉన్నారు.
- బీడీఎస్ ఉద్యోగులకు కేటాయించిన రెండు డైరెక్టర్ స్థానాలకు నలుగురు పోటీ పడ్డారు. వీరిలో కె.సూర్యనారాయణరెడ్డి, బి.నాగభూషణం గెలుపొందారు. మొత్తం 471 ఓట్లు రాగా, 18 ఓట్లు చెల్లకుండాపోయాయి. విజేతలకు ఎన్నికల అధికారి ఎస్.కుమార్ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

10న అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి ఎన్నిక ..

11 డైరెక్టర్ స్థానాలకు ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో గెలుపొందిన డైరెక్టర్లలోనే ముగ్గురిని అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శిని ఎన్నుకోవాల్సి ఉంటుందని ఎన్నికల అధికారి కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఈ నెల 10న ఎన్నిక నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 9 నుంచి 11 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ, 11.30 గంటలకు పరిశీలన, 12 నుంచి మధ్యాహ్నం 2 గంటల్లోపు ఉపసంహరణ ప్రక్రియలు ఉంటాయని వివరించారు. అదే రోజు మధ్యాహ్నం 2.30కు తుది జాబితా ప్రకటించి, 3 నుంచి 5 గంటల వరకు పోలింగ్, ఆ వెంటనే ఓట్ల లెక్కింపు, విజేతల ప్రకటన ఉంటుందన్నారు.



అనంతపురం జూనియర్ కళాశాలలో హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు, ఎస్ఎస్‌బీఎన్‌లో విద్యార్థిని తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి పంపుతున్న సిబ్బంది


హాజరు నమోదు చేస్తున్న సిబ్బంది


జూనియర్ కళాశాల వద్ద తనిఖీ చేసి విద్యార్థులను అనుమతిస్తున్న దృశ్యం

ప్రశాంతంగా నీట్

అనంతపురం: వైద్య కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన నీట్ (జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష) ఆదివారం అనంతపురంలో ప్రశాంతంగా జరిగింది. ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల కేంద్రంలో 936 మందికి గాను 920 మంది, ఎస్కేయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో 600 మందికి గాను 587 మంది, కేఎస్ఎన్ డిగ్రీ కళాశాల (ఉమెన్)లో 504 మందికి గాను 494 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాయ్స్)లో 408 మందికి గాను 401 మంది, రాజేంద్ర మునిసిపల్ ఉన్నత పాఠశాలలో 360 మందికి గాను 350 మంది, కేఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికలు)లో 177 మందికి గాను 172 మంది పరీక్షకు హాజరైనట్లు సిటీ కోఆర్డినేటర్ ఎస్.కరీం ఖాన్ తెలిపారు. మొత్తం 2,985 మందికి గాను 2924 మంది (97.96 శాతం) పరీక్ష రాశారన్నారు. 61 మంది గైర్హాజరైనట్లు వెల్లడించారు. నిర్దేశించిన సమయం కంటే విద్యార్థులు ముందుగానే పరీక్ష కేంద్రంలోకి వచ్చారన్నారు.

నేటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు

అనంతపురం: వేసవి సెలవులను వృథా కానివ్వకుండా విద్యార్థులకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమామోహన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ.. సోమవారం నుంచి జూన్ 11వ తేదీ వరకూ 35 రోజుల పాటు వేసవి విజ్ఞాన శిబిరాలు ఉంటాయన్నారు. రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ వివిధ అంశాలపై విద్యార్థులు పట్టు సాధించేలా పలు కార్యక్రమాలకు రూపకల్పన చేసినట్లు వివరించారు. బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్, పుస్తక సమీక్ష, డ్రాయింగ్, ఆటలు తదితరాలతో విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

పామిడి: పదో తరగతి ఉత్తీర్ణత కాకపోవడంతో మనస్తాపం చెందిన ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు... పామిడిలోని ఎద్దులపల్లి రోడ్డులో నివాసముంటున్న రాజు కుమారుడు శ్రీనివాసులు (17) గత ఏడాది పదో తరగతి పరీక్ష రాశాడు. అందులో ఉత్తీర్ణత సాధించకపోవడంతో ఈ ఏడాది మరోసారి పరీక్ష రాశాడు. శనివారం తాను ఫెయిల్ అయినట్లు తెలుసుకుని మనస్తాపానికి లోనై ఊజీ మాత్రలు మింగాడు. గమనించిన తల్లిదండ్రులు హుటాహుటిన అనంతపురంలోని వైద్యశాలలో చేర్పించారు. రాత్రి శ్రీనివాసులు మృతి చెందాడు.

నాలుగు దశాబ్దాల అనుబంధం


ముదిగుబ్బలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు


కొండకమర్లలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ముదిగుబ్బ/ఓడీ చెరువు: నాలుగు దశాబ్దాల క్రితం కలసి చదువుకున్న వారందరూ ప్రస్తుతం ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. ఇంత కాలం ఫోన్ పలకరింపులకే పరిమితమైన వారందరూ ఒక్కటిగా కలవాలని అనుకున్నారు. అనుకున్నదే తడవుగా తామంతా కలసి చదువుకున్న పాఠశాలలో ఆదివారం కలిశారు. 1982-83 విద్యా సంవత్సరంలో ముదిగుబ్బలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఓడీసీ మండలం కొండకమర్లలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యాబుద్ధులు గడించిన వారంతా వేర్వేరు ఘటనల్లో ఒక్కటిగా కలిశారు. ఆత్మీయ పలకరింపులతో సందడి చేశారు. ముదిగుబ్బలోని వాసవీ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో నాటి గురువులు శ్రీనివాసరెడ్డి, కుళ్లాయిరెడ్డి, చెన్నారెడ్డి, కొండారెడ్డి, ఇమాంషరీఫ్‌ను ఘనంగా సన్మానించి, ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. అంతకు ముందు తమతో పాటు చదువుకుని, ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన రామకృష్ణ కుటుంబాన్ని పరామర్శించారు. రూ.25 వేలు ఆర్థిక సాయం అందించారు. చదువుకున్న పాఠశాలకు రెండు బీరువాలు వితరణ చేశారు.

- కొండకమర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో నాటి గురువులు బాబాఫక్రుద్దీన్, ఆంజనేయులు, పోతిరెడ్డి, చలపతి, అంజినప్ప తదితరులను ఘనంగా సన్మానించారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు లక్ష్మీనరసప్ప, ఆంజనేయులు, భాస్కర్‌రెడ్డి, బాబ్జాన్, శ్రీనివాసులు, రహీంసాహెబ్, శారదరెడ్డి, నిర్మల, కోమల, లక్ష్మీదేవి, రెడ్డెమ్మ, వెన్నెల తదితరులు నేతృత్వం వహించారు.

టెంపోను ఢీ కొన్న లారీ

- 10 మందికి గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం

పామిడి: టెంపోను లారీ ఢీకొన్న ఘటనలో పది మంది గాయపడ్డారు. వీరిలో ఆరుగురికి తీవ్ర గాయాలు కాగా, ఇద్దరి పరిస్థితి విషమంగా మారింది. పోలీసులు తెలిపిన మేరకు... బెంగళూరుకు చెందిన పది మంది శనివారం రాత్రి టెంపోలో మంత్రాలయానికి బయలుదేరారు. అర్ధరాత్రి పామిడి మండలం రామరాజుపల్లి వద్ద ఉన్న రిలయన్స్ పెట్రోల్ బంకు వద్దకు చేరుకోగానే ఎదురుగా రాంగ్ రూట్‌లో వచ్చిన రాజస్తాన్‌కు చెందిన లారీ ఢీ కొంది. లారీలో డీజిల్ వేయించుకునేందుకు డ్రైవర్ రాంగ్ రూట్‌లో ప్రవేశించినట్లు తెలిసింది. ఘటనలో టెంపో ధ్వంసమైంది. టెంపోలో ప్రయాణిస్తున్న పది మంది గాయపడ్డారు. వీరిలో ఆరుగురికి తీవ్ర రక్తగాయాలయ్యాయి. ఇందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను హుటాహుటిన కర్నూలు సర్వజనాస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఘటనపై పామిడి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.


దెబ్బతిన్న టెంపో